
# గురు స్తుతి



# విషయ సూచిక


1. గురుస్తవం
2. భక్తిభావాలు
3. సాధనా రహస్యం
4. శరణాగతి
5. నిత్యపున్నమి చంద్రుడు
6. విన్నపం
7. మాతృదేవోభవ
8. ఓ నాన్న....
9. గురు మహిమ
10. అభయదాత
11. వందనం
12. అంతర్యామి
13. నాన్నగారంటే
14. ఆత్మబంధం
15. హృదయాంజలి
16. అద్వయం
17. మార్గదర్శి
18. మాకంటివెలుగు
19. రమణపుత్రులు
20. త్వమేవ శరణం
21. అంతా నీవే
22. జ్ఞానబోధ
23. ప్రేమమూర్తి
24. కారుణ్యమూర్తి
25. మోక్షప్రదాత
26. శరణం తవచరణం
27. ప్రార్థన
28. శ్రీనాన్న మహదేవ
29. శ్రీనాన్నవైభవపంచకం-1
30. శ్రీనాన్నవైభవపంచకం-2
31. శ్రీనాన్నవైభవపంచకం-3
32. శ్రీనాన్నవైభవపంచకం-4
33. శ్రీనాన్నవైభవపంచకం-5
34. హారతి
35. మంగళ హారతి
36. కవిత

సేకరణ : ఎన్. లక్ష్మి

# ముందుమాట

మహోన్నతమైన మానవజన్మనెత్తినందుకు ఏ పరమస్థితిని మానవుడు పొందాలో శ్రీరమణుల కృపవల్ల శ్రీనాన్నగారు పొందారు. అరుణాచలేశ్వరుడు రమణుని ఎంచుకున్నట్లుగా రమణతత్త్వాన్ని మానవాళికి బోధించగల వ్యక్తిగా భగవాన్ నాన్నగారిని అనుగ్రహించారు.

స్వచ్ఛమైన తెల్లని ఖాదీ పైజామా, లాల్చీ ధరించి మెడపైన తుండుతో, నిర్మల మందహాసంతో, కరుణ నిండిన చూపులతో ముఖమండలంలో చెదరని శాంతితో, దివ్యకాంతితో మెరిసిపోయే నాన్నగారిని పాశ్చాత్యులకి పరిచయం చేసిన పాశ్చాత్య భక్తుడు రోజర్ హౌస్‌డెన్ వారి చూపులలోని ప్రత్యేకతను వర్ణిస్తూ... "వారి చూపు కోమలం. కరుణాపూరితం. ప్రియుడు ప్రేయసికై సారించినదానివలే ఆ చూపులో కర్తృత్వ భావంగాని, వ్యక్తిత్వభావంగాని, కామనగానీ, ఏదో ప్రయోజనం సాధిద్దామన్న ఉద్దేశంగాని లేదు. ఆ చూపు ప్రేమ మయం. అది అందరికీ లభ్యమే కాని ఎవరిమటుకు వారు అది తమకి మాత్రమే ప్రత్యేక మనుకుంటారు" అంటాడు. నిజమే! ఇది ప్రతి ఒక్కరికీ అనుభవ సిద్ధమే. బుద్ధుని కళ్లను బోలిన ఆ విశాల నేత్రాలనుండి జాలువారే శక్తి తరంగాలు మనల్ని పునీతుల్ని చేస్తాయి.

"ఏమీ తెలియని, అక్షర జ్ఞానంలేని వారికి ఆధ్యాత్మిక విద్యను బోధించి ఆత్మ సింహాసనం మీద కూర్చోపెట్టడం నా గమ్యం" అంటూ నిగూఢమైన ఉపనిషత్తులసారాన్ని, వేదాంతతత్త్వాన్ని చిన్న చిన్న మాటలతో, పొట్టిపొట్టి వాక్యాలతో సామాన్యమానవుడు అందుకోగల స్థాయికి తెచ్చిన ఘనత శ్రీ నాన్నగారికే దక్కుతుంది.

వారి ప్రసంగాలు మనలో తార్కిక బుద్ధిని పెంచుతాయి. ఇలా చెయ్యమని మాటలలో ఆదేశించరు. హృదయాంతరాళాల్లోంచి అలా ఉండేలా భక్తుల్ని అనుగ్రహిస్తారు. సూక్ష్మదృష్టి మనకు కలిగేలా మనకు తెలీకుండా మనలో మార్పు తీసుకురాగలగడం ఒక్క నాన్నగారికే సాధ్యం.

అతి సూక్ష్మమైన శ్రీ రమణ తత్త్వాన్ని పామరులకు కూడా సులభంగా అర్థమయ్యేటట్లు తమదైన విశిష్టశైలిలో బోధిస్తున్న సద్గురువు శ్రీనాన్నగారు. 1998 సం॥లో వారు లండన్ దేశంలో పర్యటించారు. అక్కడ మూడు రోజులు రమణ మహర్షితత్త్వంపై అనుగ్రహభాషణలు చేసారు. భక్తి, శ్రద్ధలతో విన్న భక్తుల హృదయ స్పందనలను లిన్ గోస్విల్ ఆంగ్లంలో కవితల రూపంలో వ్యక్తం చేసారు. వాటిని రమణ భక్తులు శ్రీ పింగళి సూర్యసుందరంగారు తెలుగులోకి అనువదించారు. వీటితోపాటు నాన్నగారి బోధ ద్వారా అలజడిలేని జీవితాలు సాగిస్తున్న భక్తులు శ్రీనాన్నగారిని స్తుతిస్తూ రాసిన కవితలు, పాటలు కూడా ఇందులో సంకలనం చేయడం జరిగింది.

పరిమితుడైన జీవునికి అపరిమితమైన భగవంతునికి మధ్య చక్కని వారధి గురువు. అట్టి సద్గురువు శ్రీ నాన్నగారికి దేశ, విదేశీ భక్తుల అక్షర నీరాజన సంకలనమే ఈ చిన్ని పుస్తకం. ఆ గురువైభవంలో మనమూ పాలు పంచుకుందాం.

శ్రీ నాన్నగారిలోని ఆత్మవైభవాన్ని ఎవరు గ్రహించి, సత్యాభిముఖంగా పరివర్తన పొందినా ఈ రాతలకు సార్థకత సమకూరుతుందని భావిస్తూ....

ఎన్. లక్ష్మి

మిడ్సమ్మర్ రిట్రీట్ 1998 - ఆస్టిన్‌లాడ్జ్, డార్సెట్ 19/2, జూన్ 1988

# గురుస్తవం

గురుదేవా! ఎంత అద్భుతమయ్యా నీవు
జన్మ జన్మాంతరాలలో మా తప్పటడుగులు సరిదిద్దుతూ
మేము నీకంటే భిన్నము కాదని గ్రహించే వరకూ
మమ్మల్ని ఎంత మృదువుగా గమనిస్తున్నావయ్యా!
ఓరి భగవంతుడా! ఎంత అద్భుతమయ్యా నీవు

ఆనందం కోసం లోకపు సిరులలో ఆత్రంగా
వెతుక్కునే మమ్మల్ని ఎంత ఓర్పుతో గమనిస్తావయ్యా!
సంపదా ఖ్యాతీ నెమ్మదిగా ఆరిపోయే దీపాలనీ
నిత్యజ్యోతి మాలోనే ఉన్నదని గ్రహిస్తాము క్రమేణ

విజ్ఞతతో, నిరహంకారంతో బ్రతకాలి
ప్రేమ పూరిత హృదయంతో, విశ్వాసంతో
స్పష్టతతో పలుకాలి
దయతో కారుణ్యంతో ప్రతి పనీ చేయాలి
నిత్య నూతనమైన ఔదార్యంతో మెలగాలి.

జీవితమనే రైలుబండిలోని ప్రయాణీకులం మేము
ఇంజన్‌వైపు మా ముఖాలు లేవు
దాటిపోయిన దృశ్యాలే కనబడతాయి మాకు
ముందేమి రానున్నదో కనబడదు మాకు
అయినా బండిని నడిపే నీపై విశ్వాసముంది మాకు
గమ్యాన్ని చేరుస్తావని నమ్మకముంది మాకు

మేం పయనించవలసిన మార్గాన్ని మా కర్మే నిర్ణయించింది
ఇక్కడ ఎవరి కర్మ వారిది
ఒకోసారి వేగంగా, చీకటిలో భయంతో పోతుంది
అయినా, గమ్యాన్ని చేరుతామని నమ్మకముంది.

జీవితమంటే ఇదేననిపిస్తుంది
కాని స్వప్నమే కదా ఇది
ఆత్మకి హాని ఎట్లా కలుగుతుంది
తండ్రి చేతిలో హాయిగా నిదురించే
బిడ్డ ముఖం మీద చిట్లింపే కదా ఇది.

ఆఖరికి స్వప్నం నుండి మేల్కొన్నప్పడు
వర్తమానమే మనసు పొరలను చీల్చి
ఎల్లవేళలా ఉన్నదేనని తెలియజేస్తుంది
గడచిన గాథని తెలియజేసేదెవరూ లేరు!

- లిన్ గోస్వెల్

తెలుగు అనువాదం : పింగళి సూర్యసుందరం



# భక్తి భావాలు

వేకువ జామున నాలో
ఏ తలంపూ ఉదయించక ముందే
నా తనువునీ మనస్సునీ హృదయాన్నీ
విశ్వాసముతో నా గురువునకు సమర్పింతును గాక!

దరహాసం నాన్నగారిదైనా, శ్రీ భగవాన్‌దైనా
అంతరంగంలోని గురుముఖానికి భౌతికరూపమే కదా!

వీడని కాంక్షతో గురుని వీక్షించు
నీ నిజతత్త్వాన్ని గాంచు
అది చాలు నీకు.

వేదనలో, శోకపు సమయంలో
ఉపశమనమేదో గుర్తెరుగు
దుఃఖంలో వారి చూపుని స్మరించు
అంతటితో ఊరట చెందు

మనస్సు మోడైనప్పడు, బీటలు వారినప్పడు
వారి ప్రియస్పర్శ కరవైందనిపించినప్పడు
నీ ప్రేమకు వారి ప్రతిస్పందనను
వినమ్రతతో వేచియుండు
దానినే వారికి సమర్పించు

ఆ ఆనందానుభూతి ఎప్పడూ

అందుబాటులో ఉంటే
"అహం" గర్వంతో ఉప్పొంగుతుంది
నీకు అనర్థదాయకమవుతుంది

అది ఎక్కడో దూరాన ఉన్నట్లనిపిస్తే
వినయముతో గ్రహించు
వర్షమెంతగా కురుస్తున్నా
మేఘాల మాటున సూర్యుడున్నాడని
వారి ప్రేమ కాంతికై దూర ప్రయాణమేల,
స్వకల్పిత మేఘాలను దాటు, దాపుననే ఉన్నారు వారు

గురుని ప్రేమ నిగూఢం
మనకది దురవగాహం
ఆ వీక్షణం నిన్ను సోకినప్పుడు
సర్వస్వమూ వారికే విడనాడు.

గురుని ప్రేమాను రాగాలు
దుఃఖాన్ని అంతమొందిస్తాయి
అవి ఇప్పుడే ఇక్కడే లభ్యం
నిన్నో, నేడో, ఎప్పుడో కాదు

గురుని వీక్షణం నీపై
అనుగ్రహాన్ని వర్షిస్తుంది
నీవు నిత్య విముక్తమైన ఆత్మవనీ
నీ నిజతత్త్వమదేననీ
దేహమూ మనస్సూ కావనీ గ్రహింపచేస్తుంది

ఆత్మవిచారానికి భక్తి అవసరం
సత్య దర్శనానికి హృదయార్పణమవసరం


మౌనం సమాయత్తపరుస్తుంది
మనస్సు తన మూలాన్ని కనుగొనటానికి
విస్తృతమయే మౌనాకాశమది
అనుగ్రహపు ఎరుక అది.

అరుణాచలా! సుందరా! ఈ
అహాన్ని ధ్వంసం చెయ్యి
ఆనందంలో దానిని అంతమొందనియ్యి
పులినోట పడిందది

ఈ పంక్తులను స్మరించినపుడల్లా
నా గురుని ముఖం దర్శనమిస్తుంది
ఊరటతో నవ్వుకుంటాను
నా భయాలను పారద్రోలుతాను.

- లిన్ గోస్వెల్

తెలుగు అనువాదం : పింగళి సూర్యసుందరం



# సాధనా రహస్యం

శుక్రవారపు ముందురోజున
మనం కలుసుకున్న పిదప
ఎంత త్వరగా వెళ్లిపోయింది కాలం!
మాకు లభించిన ప్రేమతో
మా గుండెలు నిండిపోయాయి.

ఈ మనస్సు రహదారి మీద రణగొణ ధ్వని వంటిది
మేకల కేకల వంటిది
శరణొందండని భగవాన్ గుసగుసలాడారు
కాని లొంగడానికి మాకే అభ్యంతరం.

మౌనంగా ఇట్లా కూర్చున్నప్పడు
పక్షుల కిలకిలా రావాలు తప్ప ఏమీ లేనప్పడు
మౌన బోధ మమ్మల్ని ఏ
అగాధాలలోకో తీసుకు పోతుందని
ఎరుక కలుగుతోంది.

భగవాన్ అనుగ్రహమెల్లెడలా
విస్తరిస్తోందని ఈ గదిని
శాంతితో నింపేస్తోందని
అనిపిస్తుంది మాకు.

"అన్నింటినీ విడిచిపెట్టు -
నీ హృదయానికి స్వేచ్ఛ లభిస్తుంద"ని

వారంటారు మాతో
గురువు దేహధారి కావచ్చు
పంచభూతాలతో ఏకమవవచ్చు
ఏమైతేనేం -
ఆయనకి విశ్వాసాన్నంతా అర్పించటమే ముఖ్యం.

ప్రతి అవమానాన్నీ
ప్రతిగాయాన్నీ
ఓర్చుకో, ఇంతకన్నా
గొప్ప సాధనేదీ లేదు

ప్రభూ! కృతజ్ఞతా సూచకంగా
నీకేమి అర్పించగలం?
మనసుని విడిచిపెట్టు,
అహాన్ని విడిచిపెట్టు,
శాంతిని, ప్రేమని ఆనందాన్ని
విరజిమ్ము! అంటారు మీరు

ప్రియతమ నాన్నగారూ!
మాకివ్వండి మీ
ఆశీర్వాదం, మీ అనుగ్రహం
భగవాన్ అనుగ్రహానికి
ప్రతిబింబమైన మీ అనుగ్రహంతో
మా హృదయాలు నిండిపోవుగాక!

- లిన్ గోస్పెల్

తెలుగు అనువాదం : పింగళి సూర్యసుందరం

# శరణాగతి

మన ప్రియతమ భగవాన్‌ని విశ్వసించు
సజీవ గురుని ధ్యేయం
ఆధ్యాత్మిక జ్ఞానాన్నీ, మంచి తనాన్నీ
అందరికీ పంచటం.

సత్యాన్ని మన నుంచి మరగుపరచే
వాసనలని దగ్ధం చేస్తుంది
మనో వికారాలని ఏరిపారవేస్తుంది అనుగ్రహం

నా సొంత మనిపించే ఏ భావమైనా
లోపల శాంతిని విఘాతపరుస్తుంది
విముక్తి నొసగే స్పష్టమైన
దృష్టిని కప్పివేస్తుంది.

గురుదేవా! ఎప్పడూ నా హృదయంలోకి
సత్యానికి మార్గం చూపు
అప్పడుగాని ఆది నుంచీ అది
ఉండనే ఉందని, కళ్ళు తెరచి చూడలేను.

శిష్యుడు ఏ యత్నం చేయగలడు?
గురుని విశ్వసించు, అన్నిటినీ విడిచిపెట్టు
సుఖదుఃఖాలలో ఆయనే
మార్గం చూపుతారని నమ్ము.

ఇది నిజం - ఏది జరిగినా మన మంచికొరకే

ఏ కష్టం కలిగినా - దానిని స్వీకరించు, భరించు.

అంతా సవ్యంగా ఉన్నప్పుడు

వారిని విశ్వసించటం సులభం

భయాందోళనలో కూడ

వారిని స్మరించటం కొందరికే సాధ్యం.

జీవితపు దుఃఖాలని వరాలుగా మార్చి

శాంతిని ఒసగే పరుసవేది శరణాగతి.

అప్పడే గ్రహిస్తాం మన నిజస్వరూపాన్ని

వాగుతూండే మనస్సు మూలం

మౌనం ద్వారా కనుగొంటాం

అదే పరమోత్కృష్టం.

నీవూ గురువూ దైవమూ - అన్నీ ప్రేమే

ఇది విస్మరింపకు

మనసు మూలంలో ఉన్నదొకటే -

అదే మౌనం.

- లిన్ గోస్పెల్



# నిత్య పున్నమి చంద్రుడు

జీవితంలో సాధన చేయటం నేర్పే గురువు కాదు
సాధనతో జీవించటం నేర్పిన గురువు శ్రీ నాన్న.

మనశ్శాంతిని ప్రసాదించే గురువు కాదు
మనస్సులో శాంతి లేదని తెలిపి ఆత్మశాంతిని రుచి
చూపే గురువు శ్రీ నాన్న.

మాయలు చేసే గురువు కాదు
మనలో మాయను మాయం చేసే గురువే శ్రీ నాన్న.

దేహానికి కాషాయ వస్త్రాలు కట్టించే గురువు కాదు
మనస్సుకి సన్యాసం నేర్పించే గురువే శ్రీ నాన్న.

సాధనకై హిమాలయాలకు తీసుకెళ్ళే గురువు కాదు
మనస్సులోనే హిమాలయాల్ని సృష్టించి సాధన చేయించగల
సమర్థులు శ్రీ నాన్న.

జిన్నూరులోనే ఉండే గురువు కాదు శ్రీ నాన్న
తండ్రీ! అన్న తలంపు ఉన్న ప్రతిచోటా ఉండే గురువే శ్రీ నాన్న.

మన పాపాలు పోగొట్టే గురువు కాదు
మనలోని పాపబుద్ధిని పోగొట్టే గురువే శ్రీ నాన్న.

చంద్రుడు ఒక్క పౌర్ణమినాడే నిండుగా ఉంటాడు
నిన్న - నేడు - రేపు - ఎల్లప్పుడూ పూర్ణస్వరూపులు శ్రీ నాన్న.

స్వీకరించు తండ్రీ - భక్తితో నిన్ను పూజింప తెచ్చిన అక్షర సుమాల్ని

- హిమబిందు, వైజాగ్

# విన్నపం

మనసా! మనసా! నా మాట వినవే
కాస్తంత చోటు నా తండ్రి కీయవే

నవమాసాలు మోసినందుకే నా తల్లికి నువ్వు చోటిచ్చినప్పడు
ప్రతిక్షణం అరచేతిలో మోస్తున్న నా తండ్రికెందుకివ్వవు చోటు

కోరిన కోర్కెలు తీర్చే కన్న తండ్రికే చోటిచ్చినప్పడు
కోరకుండానే కోర్కెలు తీర్చే నాతండ్రి కెందుకివ్వవు చోటు

సుఖదుఃఖాలను పంచుకుంటున్న భర్తకే చోటిచ్చినప్పడు
సుఖదుఃఖాల నుండి బయటకు లాగుతున్న నా తండ్రి కెందుకివ్వవు చోటు

కాస్తంత ప్రేమను పంచుతున్న పిల్లలకే చోటిచ్చినప్పడు
నన్ను ప్రేమ సముద్రంలో ముంచుతున్న నాతండ్రి కెందుకివ్వవు చోటు

తాత్కాలిక సంతోషాన్నిస్తున్న స్నేహితులకే చోటిచ్చినప్పడు
శాశ్వత ఆనందాన్ని ఇవ్వగల నా తండ్రికెందుకివ్వవు చోటు

నింపుకున్నావు నిండుగ ఈ ప్రపంచాన్ని
మిగిల్చావు నాకు అశాంతిని

నీ మాయలో నా స్వరూపాన్ని నాకు దూరం చేసావు
ఇక నీకు రోజులు మూడాయి. అది తెలుసా నీకు.

రాగం, ద్వేషం, కోపం, అసూయతో అపవిత్రమై ఉన్నావు నీవు
తన ప్రేమతో నిన్ను పవిత్రం చేయటానికే వచ్చారు నా తండ్రి.

మంచి, చెడు తెలీదు నీకు
అది నా తండ్రి చెబితే వినవెందుకు?

నువ్వు నా తండ్రి మాట వింటే
నేనూ వింటాను నీ మాట.

నీ మూర్ఖత్వంలో నా సమయాన్ని వృధా చేయకు
నన్ను జీవించనీ నా తండ్రి చూపిన బాటలో.

అల్పురాలినైన నాతో ఎందుకు వైరం
ధైర్యముంటే నా తండ్రికి చోటిచ్చి చూడు.

నన్ను నువ్వు బానిసను చేసుకున్నావు
కాని నువ్వు బానిసవు కాక తప్పదు నా తండ్రికి.

బలవంతురాలినని ఎగిరెగిరి పడకు
నువ్వు నాశనం కాక తప్పదు నా తండ్రి చేతిలో.

నీ కోర్కెలు అన్నీ తీర్చాను ఇంతవరకు
దయచేసి ఈ ఒక్క కోర్కె తీర్చు నాకు.

ఈ ప్రపంచాన్ని తీసి, నింపుకో నిండుగా నా తండ్రిని
అప్పుడు నువ్వు, నేను, నా తండ్రి ఉందాము ఒకటిగా.

ఆ శాంతిని రుచి చూసాక అనుకుంటావు నీవు
తండ్రికి స్థానం ఇవ్వటంలో ఇంత ఆలస్యం ఎందుకు చేసానా? అని.

అందుకే

**మనసా! మనసా! నా మాట వినవే**
**కాస్తంత చోటు నా తండ్రి కీయవే**



# మాతృ దేవోభవ

పుడమి తల్లికి ఋణము తీర్చిన
సుబ్రహ్మణ్య అవతారుడైన
శ్రీ నాన్న గురుదేవులకు జన్మనిచ్చిన
ఓ తల్లీ! ఇదే మా వందనం

చల్లని వెన్నెలకన్నా చల్లదనముతో
హృదయ శాంతినిచ్చే పరమ
శాంత పురుషునకు జన్మనిచ్చిన
ఓ తల్లీ! ఇదే మా వందనం

తేనె పలుకుల వంటి బోధనలతో
భక్త జనుల హృదయాలు నింపిన
దివ్య పురుషునకు జన్మనిచ్చిన
ఓ తల్లీ! ఇదే మా వందనం

మానవాళి హృదయాలను తట్టి తట్టి లేపి
జ్ఞానజ్యోతి వెల్గించిన
జ్ఞానమూర్తికి జన్మనిచ్చిన
ఓ తల్లీ! ఇదా మా వందనం

గిరిజ, హైదరాబాదు

# ఓ నాన్న.....

ఓ నాన్నా నీ హృదయం వెన్న
అమృతం కన్న అది ఎంతో మిన్న ॥ ఓ నాన్న ॥

ఆత్మ బాటలో నీవు నడిచావు
పరమాత్మవై ఎదుట నిలచావు
ఊరూరు తిరిగావు ఇంటింట నడిచావు
జ్ఞానామృతం మాకు పంచి పెట్టావు ॥ ఓ నాన్న ॥

మనసులేని చోట నీవు ఉన్నావు
మంచి మాటలెన్నో మాకు చెప్పావు
నీ ప్రేమ గుణమే మా మూలధనము
నీవే మా పాలి దైవము, నీవే మా పాలి దైవము ॥ ఓ నాన్న ॥

శారద, హైదరాబాదు



# గురు మహిమ

ప్రేమ స్వరూపా - ఆశ్రిత వత్సల
కరుణించగ రావా - శ్రీ నాన్నగురుదేవా ॥ ప్రేమ ॥

ఎందుకు పుట్టామో - ఏమై పోతామో
ఏమో తెలియని - బ్రతుకులు మావి
జీవిత గమ్యం - తెలుపగ వచ్చిన
మోక్షప్రదాతవు - గురుదేవా ... నాన్నదేవా ॥ ప్రేమ ॥

గుడిలో దేవుడు గుండెలోనె - నిండున్నాడని
రాగం ద్వేషం తెంచుకొని - సమత్వ భావన పెంచుకొని
బ్రహ్మ భావనను నిలుపుకొని - సాధన చేస్తే పరమాత్మవు నీవేనని
తెలిపిన దేవా - గురుదేవా ... నాన్నదేవా ॥ ప్రేమ ॥

పరుగిడు తలుపులు - తుంచగరావా
ముసిరే వాసనలు - ముంచగ రావా
భవ బంధములను - తెంచగ రావా
నీ అనుగ్రహ ధారలో - తనియించవా
రావా ..... దేవా .... గురుదేవా .... నాన్నదేవా ॥ ప్రేమ ॥

- ఎన్. లక్ష్మి, హైదరాబాద్



# అభయదాత

నీ వుండ నాకేల భయము
నాన్న నీవుండ నాకేల భయము
నా అంతరాత్మవై నాలోన నీ వుండ నాకేల భయము ॥ నీ ॥

నా ఆర్తి బాపగ నా చెంత నీవుండి నా చేయి వదలకు
అభయ ప్రదాతవు ఆనందమూర్తివి
మధుర మంజుల హాస శ్రీ నాన్నదేవా ॥ నీ ॥

భక్తి మార్గము నీవు, ముక్తి మూలము నీవు
నాలోని అహమును అణచివేయుము తండ్రీ
సుజ్ఞాని కాలేని నీ చిన్ని బిడ్డను
జ్ఞాన భిక్షను పెట్టి తరియింప చేయరా ॥ నీ ॥

- డి. అనూరాధ, హైదరాబాద్



# వందనం

వందనమని వందనమని వందనమనరే

సద్గురుని చేరి, శరణుపొంది, శాంతి నొందరే

హృదయ శాంతినొందరే

జ్ఞాన గురుడు శ్రీ నాన్నయని మదిని నమ్మరే

ఆ మార్గమందు నడువనేర్చి సంతసించరే... సంతసించరే..

॥ వందన ॥

ఒకనాడు స్వప్నమందు శ్రీ నాన్నకు... విచిత్రము జరుగ

శ్రీ రమణుడే నాన్నను తన ఒడిని చేర్చి

ముద్దులిడి తన హృదయమివ్వగా... రమణహృదయమివ్వగా

॥ వందన ॥

మనలోని దేహవాసన దగ్ధము చేయ

ఆ దైవమే శ్రీ నాన్నగా రూపొందెను కాదా.... రూపొందెను కాదా.....

॥ వందన ॥

# అంతర్యామి

కొండలు, గుట్టలు ఎక్కుట మాకేలా
ఎక్కి మొక్కుబడులు చెల్లించుటేలా
రమణ స్మృతులే ఉన్న రాజ్యములు మాకేలా
శ్రీనాన్న దరియున్న ఐశ్వర్యమేలా! ॥ కొండలు ॥

కలలోని రమణుడు కనిపించు నాన్న
అరుణాచలేశ్వరుని ఆత్మ స్వరూపం
తలచినంతనే ఎదుట నిలిచెడి దైవమా
జయదేవ గురుదేవ, ఓ నాన్నదేవా! ॥ కొండలు ॥

కాళింగ సర్పము మదమణచి కృష్ణుడుగ
బాలగోపాలమును కాపాడలేదా!
భక్తులండగ నిలిచి ఆదుకొను దైవమా
జయదేవ, గురుదేవ ఓ నాన్న దైవమా! ॥ కొండలు ॥

కంఠమందు గరళముంచినా శివుడుగా,
దేవ దానవుల పై దయ చూపలేదా!
భక్త రక్షణ కోరు భగవత్ స్వరూపం
జయదేవ, గురుదేవ, ఓ నాన్నదేవా! ॥ కొండలు ॥

అక్కడా, ఇక్కడా అంతటా ఉన్నారు
ఎక్కడెక్కడికో మేమెందుకెళ్లాలి
అమరలోకము కన్న మిన్న మీ సన్నిధి
జయదేవ, గురుదేవ, ఓ నాన్నదేవా! ॥ కొండలు ॥

దేవుడవు కాదని తలచిన నాకు
ఈశ్వరుడుగా మీరు అగుపించినారు
మంత్రపురి భక్తుని మన్నించుదేవా
జయదేవ, గురుదేవ, ఓ నాన్నదేవా ॥ కొండలు ॥

సురేష్, నాగపూర్

# నాన్నగారంటే

కరుణామయులూ - మా నాన్నగారు
కలతలు బాపును - శ్రీ నాన్నగారు
రమణ పుత్రుడు - మా నాన్నగారు
మరువం మరువం - మదిలో యెప్పడు ॥ కరుణా ॥

జిన్నూరు పురమునా - దివ్య కాంతులతోను
నరుడై పుట్టెను - మా నాన్నగారు ॥ కరుణా ॥

శివకుమారుడు - మా నాన్నగారు
తత్త్వబోధనూ చేయును - శ్రీ నాన్నగారు ॥ కరుణా ॥

స్థితప్రజ్ఞులు - మా నాన్నగారు
సూటిగ జ్ఞానము - దెలిపెడివారు ॥ కరుణా ॥

దేహ మోహంబును - గూల్చగ వారు
దీక్ష బూనిన - మా నాన్నగారు ॥ కరుణా ॥

నేను నేననే - నేను కానని
ఆ నేనంటే ఎవరో - దెలిపెడివారు ॥ కరుణా ॥



# ఆత్మ బంధం

కలియుగ అవతారా .... దేవా ... నాన్న పరమాత్మా

ఆత్మ బంధువూ, అంతర్యామి

ఓ నాన్న పరమాత్మ ॥ కలి ॥

రమణ మహర్షి శిష్యులు మీరు

అరుణాచల శివ భక్తులు మీరు ॥ 2 ॥

నేనను అహమును వీడమనెడి

రాజులకే రారాజులు మీరు ॥ కలి ॥

సద్బోధనలను బోధించి

మము సన్మార్గంబున నడిపించి ॥ 2 ॥

కామక్రోధములను అణిగే శక్తిని

మాలోనే కల్గించిన దేవా ॥ కలి ॥

సూర్యకాంతితో వెలిగే ముఖమూ

మంచు కొండలా చల్లని మనసు ॥ 2 ॥

మీ తెల్లని దుస్తులె మల్లెపువ్వులా

భక్తుల మనసును శాంత పరచునూ ॥ కలి ॥

- సురేష్ (నాగపూర్)



# హృదయాంజలి

రమణుని నామం - అమృతపానం ॥ 2 ॥

శ్రీ నాన్న హృదయం - రమణుని రూపం ॥ 2 ॥ ॥ రమ ॥

జీవిత నావకు చుక్కాని నీవని ॥ 2 ॥

శరణము వేడితి బోధించరావా ॥ 2 ॥

దరి చేర్చు భారము శ్రీ నాన్న నీదే

ఇహ పర దైవముగా ॥ 2 ॥ ॥ రమ ॥

వేదము నీవని - జ్ఞానము నీవని ॥ 2 ॥

వెలిగించనా నే - కర్పూర దీపం

అర్పించనా హృదయం శ్రీ నాన్న నీకు

రమణుడె కొలువుండగా ॥ రమ ॥

శృంగవృక్షం, 23-11-88



# అద్వయం

ఏమని దెలిపెదా - మా నాన్ననూ
నేనేమని కొనియాడెదా - శ్రీనాన్ననూ ॥ ఏమని ॥


జిన్నూరు పురమునా మానవ రూపముతో
మన ముందు నిలచినా సద్గురుమూర్తినీ
జ్ఞాన రూపునీ - కరుణా సుధాబ్ధిని ॥ ఏమని ॥

అరుణాద్రి శివుడే - శ్రీరమణుడై
శ్రీరమణుడే - మా నాన్నలో నిలిచి
మాలోన దోషములు - రహితంబు చేయ మహితాత్ముని
॥ ఏమని ॥

శ్రీ రమణ కనులు - మా నాన్న కనులు
మా నాన్న చూపులు - శాంతికి నిలయాలు

నేను నేననేటి ఈ మూఢ భావమును -
మదిలోన ద్రుంచిన మహనీయుని ॥ ఏమని ॥

సురేష్ - నాగపూర్



# మార్గదర్శి

జ్ఞాన మిచ్చినది నీవే నాన్న
నాకీ జ్ఞానమిచ్చినది నీవే నాన్న!
జీవితగమ్యం తెలియగ
నాకీ జ్ఞానమిచ్చినది నీవే నాన్న ... నీవే నాన్న!
ఎన్ని జన్మములు గడచినవో
నేనెవరో తెలియక నీ కృపా దృష్టితో ననుకరుణించి
దారి చూపితివి నీ దరిచేరగా ... నీ దరి చేరగా ॥ జ్ఞాన ॥

దేహము నేనను మోహము వీడక
నేనూ - నాదను సుడిలో తిరిగెడు
జీవభావమును తొలగింపంగ
దారి చూపితివి నీ దరిచేరగా ... నీ దరి చేరగా ॥ జ్ఞాన ॥

బ్రతుకు నాటకమున ఆత్మను మరచి
బొమ్మల వోలె అటునిటు తిరిగెడు
మాయా జగతికి తెరదీసి
దారి చూపితివి నీ దరిచేరగా ... నీ దరిచేరగా ॥ జ్ఞాన ॥

లక్ష్మి (మలక్‌పేట)



# మాకంటి వెలుగు

రావయ్యా జిన్నూరు పురవాసా!
మమ్మేల రావయ్యా శ్రీ నాన్నఈశా!
అడుగడుగు దండాలు నీకయ్యా!
మమ్మేలు దొరవు నీవయ్యా! ॥రావయ్యా ॥

ఏడేడో తిరిగాము ఇన్నినాళ్ళు
నిను వదల లేమయ్యా ఉన్ననాళ్ళు
జీవునికి దేవునికి ఉన్న సంబంధం
నీకు నాకు ఉన్న ఈ బంధం ॥ రావయ్యా ॥

చీకటి బతుకుల్లో వెలుగునీవు
కన్నీళ్ళు తుడిచేటి తండ్రి నీవు
అడుగడుగు నడిపించే తల్లి నీవు
అజ్ఞాన తెరతీయ గురువు నీవు ॥ రావయ్యా ॥

లక్ష్మి



# రమణపుత్రులు

జిన్నూరు పురమున పుట్టిన
వెంకట లక్ష్మీనరసింహ భూపతిరాజుగా
నేడు శ్రీనాన్నగారని బిరుదుతో
ఖ్యాతినొందిన రమణకుమారుడుగా ॥ జిన్నూరు ॥

రమణుని బోధలు రమ్యంబుగాను, మధురంబుగాను
గలగల పారే సెలయేరుగాను
రమణుని కరుణ ఉప్పొంగగాను మోహాంకురములు
నశియించునూ అని బోధించును నాన్న బోధించును
॥ జిన్నూరు ॥

తండ్రి ఆజ్ఞ పాలించగా మీరునూ
గ్రామగ్రామంబునకు తరలి వెళ్ళియూ
జ్ఞాన బోధలు చేయుచు మీరునూ
దేహ మోహంబు గూల్చగ దీక్షతో ॥ జిన్నూరు ॥

నేను నేననేటి ప్రతి తలపునూ బంధించుమా
రాగద్వేషములు మది పెంచును
తలపులు మరచి రమణుని తలచి
మీ హృదయ కుసుమాలు అర్పించుమా యని
బోధించునూ - నాన్న బోధించునూ ॥ జిన్నూరు ॥



# త్వమేవ శరణం

శ్రీ నాన్న నీ చరణమె శరణం
కావుమయ్య కరుణా సాగరా ॥ శ్రీ ॥

రాగభోగముల ఇలనే కోరను
నీ శ్రీచరణమె దిక్కని నమ్మితి
భవసాగరమును దాటగ జేయుము
నీ కృప నాపై చూపుము తండ్రి ॥ శ్రీ ॥

నే నెవడననే ధ్యాసే లేదు
నీవు తప్ప మరి దిక్కెవరయ్యా
నీ చేయూతను నా కందించి
నన్నీ జన్మతో కడతేర్చవయా ॥ శ్రీ ॥

కామ క్రోధమనే మొసలికి చిక్కితి
కరుణతోడ కాపాడగ రావా
నీవే దిక్కని నమ్మితినయ్యా
నీ అభయము నా కందించవయా ॥ శ్రీ ॥

సురేష్ - నాగపూర్



# అంతా నీవే

జిన్నూరి పురవాసా! జయదేవ జగదీశా!
దీన బాంధవ ధవళేశా! ఓంకార ఓ నాన్న!

విశ్వేశ్వర విశ్వనాథా! పరమేశ్వర పరంధామా!
సర్వజ్ఞ సర్వేశా! ఓంకార ఓ నాన్న!

శ్రీరామరామేశ్వరా! శ్రీశైలమల్లిఖార్జునా
పర్లిలో వైద్యనాథా! ఓంకార ఓ నాన్న! ॥ జిన్నూరి ॥

ఉజ్జయినీ మహాకాళా! అవుండా నాగనాథా!
ఘృష్ణేశ్వర భీమశంకరా! ఓంకార ఓ నాన్న! ॥ జిన్నూరి ॥

శ్రీనాన్నే శ్రీరామ! శ్రీనాన్నే శ్రీకృష్ణా!
శ్రీరామ శ్రీకృష్ణా! ఓంకార ఓ నాన్న! ॥ జిన్నూరి ॥

శీలేశా సిద్ధేశ! భిక్షేశ గౌతమేశ
మంత్రపురీ మహాదేవా! ఓంకార ఓ నాన్న! ॥ జిన్నూరి ॥

శ్రీ నాన్న విశ్వాత్మా!! శ్రీ నాన్న సర్వాత్మా!
మన ఆత్మలో పరమాత్మా! ఓం కార ఓ నాన్న! ॥ జిన్నూరి ॥

సురేష్ - నాగపూర్



# జ్ఞాన బోధ

సద్గురు నాన్నా రావయ్యా
సందేహములను తీర్చితివి
ఎంతటి దయగల తండ్రివయ్యా
ఎన్నటికైనా మరువమయ్యా!

భవబంధములను ద్రుంచితివి
బంధవిముక్తిని చేసితివి
జ్ఞానామృతమే పంచితివి
ఆనందములో ముంచితివి

సుఖదుఃఖమ్ములు శూన్యములేనని
సుఖజీవనమే తెలిపితివి
తాపత్రయంబులు దగ్ధమయ్యెడి
ఉపాయమంతయు తెలిపితివి

చల్లని చూపులు చూచితివి
సంశయములను తీర్చితివి
అమృత పదవికి మార్గము చూపి
అంతా తానని తెలిపితివి



ఒక భక్తురాలు

# ప్రేమమూర్తి

నాన్నగారు మాకు చాలు
మీ పాద కమల సేవ
నాన్నగారు మాకు చాలు
మీ పలుకు తేనె ధార ॥ నాన్న ॥

అమ్మ ఒడిని మేముంటే
అన్న చింతలేల మాకు
వడ్డించిన విస్తరుంటె
వంటచేయు యత్నమేల? ॥ నాన్న ॥

అసలు నేను, మిథ్యా నేను
అహంకారం, మొదటి తలంపు
ఆ తర్కము లేల మాకు
ఆ చిక్కులు వలదు మాకు ॥ నాన్న ॥

ఎన్ని జన్మలైతేనేమి
అన్నిట మిము మరువకుంటె
ఎన్ని యుగాలైతేనేమి
నాన్నగారు మీరుంటే? ॥ నాన్న ॥

- డా॥ ఆర్.ఎ. నాయక్



# కారుణ్య మూర్తి

శ్రీ నాన్న నీ చరణమె శరణం
కావుమయ్య కరుణా సాగరా ॥ ॥ శ్రీ ॥

రాగ భోగముల ఇలనే కోరను
నీ శ్రీ చరణమె దిక్కని నమ్మితి
భవసాగరమును దాటగ జేయుము ॥ 2 ॥
నీ కృప నాపై చూపుము తండ్రీ ॥ ॥ శ్రీ ॥

నే నెవడననే ధ్యాసే లేదు
నీవు తప్ప మరి దిక్కెవరయ్యా
నీ చేయూతను నా కందించి
నన్నీ జన్మతో కడతేర్చవయా ॥ ॥ శ్రీ ॥

కామక్రోధమనే మొసలికి చిక్కితి
కరుణతోడ కాపాడగరావా
నీవే దిక్కని నమ్మితినయ్యా
నీ అభయము నా కందించవయా ॥ ॥ శ్రీ ॥

ఒక భక్తురాలు



# మోక్షప్రదాత

మోక్ష మార్గము సుగమము చేయ
ధరపై వెలసిన నాన్నదేవుని తెలియండీ॥

నే నెవడుననే బ్రహ్మాస్త్రము వేసిన
రమణ మార్గము తెలియరారండీ॥

శాంతి తీరం దరికి చేర్చే
నాన్న పాదం విడువ బోకండి॥

మేను నేనను భ్రమను వీడి
ఆత్మనేనని స్ఫూర్తిని పొంది
జీవన గమ్యం తెలియండీ
జీవన గమ్యం తెలియండీ॥

ఒక భక్తురాలు



# శరణం - తవ చరణం

శరణం శరణం శరణం

జిన్నూరు వాసా తవ చరణం ॥ 2 ॥

ముక్తికి మూలం నీ చరణం

భక్తికి మార్గం నీ చరణం ॥ శ ॥

నీ కరుణే మా కభయం

మాకు రాదులే మరణ భయం ॥ శ ॥

నీ మృదుహాసం మాకు సంతోషం

మాకు తొలగులే భవ బంధం ॥ శ ॥


రాజాయమ్మ తనయా నీ చరణం

మా కందించును ముక్తి పథం ॥ శ ॥

శ్రీ నాన్న దేవా నీ చరణం

భవ భయ హరణం నీ చరణం ॥ శ ॥

ఒక భక్తురాలు





# ప్రార్థన



మనసా నువు ఎటు పోదువె సత్సంగము సల్పువేళ
సద్గురు నాన్నగారి సన్నిధి వీడి ॥ మనసా ॥

ఉరసా శిరసా దృష్ట్వా
రమణునునే యెదలో నిల్పి
మధురమైన గానరసం
పానము నే చేయువేళ ॥ మనసా ॥

చిత్తశాంతి కీ...............
గురు నామమె ఔషధమని
విత్తము పై మనసు మాపి
సద్గురు నే కొలుచుచుండ ॥ మనసా ॥

జరామరణ వర్జితమౌ
అరుణాచల లోగిలిలో
జన్మసార్థక నొందగ
జీవనమునే చేయుచుండ ॥ మనసా ॥

పెన్మెత్స శ్రీ విజయ భాస్కరరాజు

# శ్రీ నాన్న మహదేవ

అరుణాచల రమణ స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల శివ స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల గిరి స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల జ్యోతి స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల జ్ఞాన స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల తత్వ స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల ముక్తి స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల కాంతి స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల మౌన స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల శక్తి స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల శాంతి స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల సత్య స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల దయా స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల మహిమ స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల కరుణ స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల చైతన్య స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల అమృత స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

అరుణాచల అభయ స్వరూప
శ్రీ సద్గురు నాన్న మహదేవ

పెన్మెత్స శ్రీ విజయ భాస్కర రాజు

# హారతి

అరుణాచల భక్తా, దేవ జిన్నూరి నాన్న
భక్తుల బాధలు బాపి మది మందిరముగా మార్చే
కరుణా మూర్తి వయా, ఓం గురుదేవాయ నమః

సంసారము నందుండియు, సర్వము త్యజియించే నాన్న
సర్వము త్యజియించె
నిరాడంబరులు మీరు, అఖిలాండేశ్వరులు ॥ 2 ॥
ఓం గురుదేవాయ నమః ॥ అరుణాచల ॥

మీరే బ్రహ్మ, మీరే విష్ణువు, మీరే మహేశ్వరులూ ॥ 2 ॥
నాన్న మీరే మహేశ్వరులూ
మీరే తల్లియు తండ్రియు, మీరే ఘా దైవం ॥ 2 ॥
ఓం గురుదేవాయ నమః ॥ అరుణాచల ॥

సర్వశాస్త్ర పారంగతులు, సర్వజ్ఞులు, మీరు
నాన్న సర్వజులు మీరు
ఆత్మ శాంతి సమకూర్చి ఆదుకునే దైవం ॥ 2 ॥
ఓం గురుదేవాయ నమః ॥ అరుణాచల ॥

సురేష్, నాగపూర్



# మంగళ హారతి

జయ మంగళం ॥ 2 ॥ రమణునికీ జయ మంగళం

శ్రీ నాన్న రమణకె జయ మంగళం ॥ జయ ॥

అరుణేశ్వరునికి జయ మంగళం ॥ 2 ॥

అళగమ్మ తనయునికె జయ మంగళం ॥ 2 ॥

రాజాయమ్మ తనయునికె శుభ మంగళం ॥ 2 ॥

జగమేలు జ్ఞానికి జయ మంగళం ॥ 2 ॥

జయ మంగళం ॥ 2 ॥ రమణునికె జయ మంగళం

శ్రీ నాన్న రమణకె జయ మంగళం



# శ్రీ నాన్న వైభవ పంచకమ్ - 1


- వీరలక్ష్మి, తిరువణ్ణామలై

ఏమని పొగడెదను నాన్న దేవుల వైభవమేమని పొగడెదను
మాటలకందని మౌనస్థితుని, ద్వైతము కందని అద్వైత సిద్ధుని
॥ ఏ ॥

ఒకపరి నాన్నదేవుల స్వప్నమునందున
అరుణాచల రమణుల దర్శన స్పర్శన
వీక్షణానుగ్రహాదుల లబ్ధ జ్ఞానుని
అకళంక మూర్తిని అమేయ ప్రభావుని ॥ ఏ ॥

ఆగమ ధర్ముని అద్వైత ప్రబోధుని
కరుణాంతరంగుని ప్రేమాత్మ రూపుని
నిర్మలజ్ఞానుని నిశ్చలతత్త్వుని
ఆనంద నిలయుని ఆత్మానందుని ॥ ఏ ॥

ఎన్నియో జన్మల పుణ్యపురాశియే
నాన్న గురుదేవుల సాన్నిధ్య మహిమ
కరుణతో ప్రేమతో ఆత్మానందము
అందీయ వచ్చిన నిజ తత్త్వ బోధుని ॥ ఏ ॥



# శ్రీ నాన్న వైభవ పంచకమ్ - 2

- వీరలక్ష్మి, తిరువణ్ణామలై

ఏమని పొగిడెదను నాన్నదేవుల వైభవము ॥ ఏ ॥

భావము కందని భాగ్య విధాతని
తలపుల కందని పరతత్త్వ విదుని

అరుణాచల రమణుల హృదివిద్యా
వారసుని చిన్మయానంద విభుని
జగద్గురు పీఠ సేవిత పాదుని
వైరాగ్య ధీరుని భక్త వత్సలుని ॥ ఏ ॥

మాయా మోహిత మానవమదిలో
మదమాత్సర్య భావ విదూరుని
విరామ మెరుగని ఆత్మ విద్యా
బోధనైక దీక్షా దక్ష సద్గురుని ॥ ఏ ॥

తలపుల మూల తలంపును
తెలియుటే తత్త్వ మార్గమ్మని
తెలుపు వాగ్విభవ వైభవుని
కాలాతీతుని కామిత ప్రదుని ॥ ఏ ॥



# శ్రీ నాన్న వైభవ పంచకమ్ - 3

- వీరలక్ష్మి, తిరువణ్ణామలై

ఏమని పొగిడెదను నాన్నదేవుల వైభవము
ఏమని పొగడెదను ॥ ఏ ॥

కరుణా కడలిలో వెలసిన
సుధాకర పూర్ణచంద్ర తేజుని ॥ ఏ ॥

ఆతని కరుణకు కరగని మనమేది
ఆతని ప్రేమకు పొంగని హృదియేది
ఆతని పలుకుల పొందని ఆనందమేది
ఆతని సన్నిధి కానని కామితమేది ॥ ఏ ॥

నరుడవో నారాయణుడవో
సురగణ బ్రహ్మాదుల సేవిత
శ్రీ రమణ సద్గురు దేవుడవో
శరవణ భవ శివానంద ప్రదుడవో ॥ ఏ ॥

ఆనందం సచ్చిదానందం
ఆనందం పరమానందం
ఆనందం రమణానందం
ఆనందం శ్రీ నాన్నానందమే



# శ్రీ నాన్న వైభవ పంచకమ్ - 4

- వీరలక్ష్మి, తిరువణ్ణామలై

ఏమయ్యా నాన్నదేవ నీ మహిమ
నా వల్ల తెలియ తరమా గురుదేవా ॥ ఏ ॥

పరమాత్మ గురుదేవ భవదీయ
జీవనమే ఉపదేశ మార్గమై నిలిచియుండ ॥ ఏ ॥

ప్రేమాత్మ గురుదేవ నీ ప్రేమ భాషణయే
ప్రేమ తత్త్వమిదియని తెలియంగ జేయ
ప్రేమ మీర నీదు నామ సంకీర్తనయే
ప్రేమరూప మాకు అభయమ్మని తెలియజేయ ॥ ఏ ॥

నీవు నేననెడి జీవ భావము తొలగజేయ
నీదు సన్నిధి నిలిచియుంటి
నీవు సలిపిన మాయయేమో మరి
నేను భావనయె నీ సన్నిధి కానంగరాదె ॥ ఏ ॥



# శ్రీ నాన్న వైభవ పంచకమ్ - 5


- వీరలక్ష్మి, తిరువణ్ణామలై


ఏమని పొగడెదను నాన్నదేవుల వైభవము ॥ ఏ ॥
జ్ఞాన యోగ వైభవము, తత్త్వ బోధ వైభవము ॥ ఏ ॥

హృదయాంతర సంతత విహారుని
హృత్కమల స్థిత శ్రీ రమణ వైభవుని ॥ ఏ ॥

జనన మరణ భయ రహితు శ్రీ రమణ
జ్ఞాన యోగ విద్యావైభవ విభూషణుని
జనక భావనా సేవిత అశేష భక్త
జన హృదయ స్థిత పాదారవిందుని ॥ ఏ ॥

చిరుదరహసిత పూర్వ భాషణుని
చిన్మయ ప్రభాన్విత వీక్షణ శాంతుని
చింతిత భక్త జన కామిత ప్రదుని
చిత్కళా విలసిత సన్నిధి వైభవుని ॥ ఏ ॥





## సద్గురు శ్రీ నాన్నగారు

వ్యక్తికి దొరకని వ్యక్తిత్వం ప్రేమచిత్రణకి తానుగా ఒదిగింది

భక్తి నిండిన ప్రేమ ఆమె చేతివ్రేళ్ళ కొసల జాలువారి సజీవగీతమై నిలిస్తే

ఆయన కరుణ తనను తాను స్వయంచిత్రమై ఆవిష్కరించుకున్నది

దేవదేవుని వేనవేల గుణములు ఒక్క పట్టున చిత్రమున కనిన

మనస్సు మౌనచిత్తరువే అగును

కరుణావీక్షణం మధురహాసితం

ప్రేమభాషణం తిమిరహరణం

అవి సద్గురుని సొంతం